క్లుప్తంగా

లైట్లు వేయించండి



ఆర్వో ప్లాంట్‌ను పరిశీలిస్తున్న వైద్యబృందం

రాపూరు: మండలంలోని కండలేరు గురుకుల పాఠశాలలోని వంట గదిలో లైట్లు వేయించాలని వేపినాపి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు సూర్యధర్మేంద్ర సూచించారు. కండలేరు గురుకుల పాఠశాలను బుధవారం వేపినాపి ఆరోగ్య కేంద్రం వైద్యబృందం పరిశీలించింది. ఆయన మాట్లాడుతూ కండలేరు గురుకుల పాఠశాల వంట గదిలో వెలుతురు తక్కువగా ఉందని, మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించాలని, ఆర్వో ప్లాంట్ వద్ద శుభ్రంగా ఉంచుకోవాలని సూచించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు, సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపల్ భారతి, వైద్యబృందం పాల్గొన్నారు.

అతిసారంపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న వైద్యులు మోహన్‌రంగా

ఓజిలి: వర్షాకాలం కావడంతో గ్రామాల్లో అతిసారం వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారి మోహన్‌రంగా అన్నారు. మండలంలోని అత్తివరం ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో స్టాప్ డయోరియా కార్యక్రమంపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. హెచ్‌ఎం శోభనకుమారి, వైద్య సిబ్బంది రాజగోపాల్, కిరణ్‌కుమార్, ఏఎన్‌ఎం కుసుమకుమారి, రూథ్‌వినయ, జాన్సి పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న ట్రస్టు సభ్యులు

చిల్లకూరు: మండలంలోని పారిచెర్లవారిపాళెం గ్రామానికి చెందిన యస్దాని క్షయ వ్యాధితో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యాడు. విషయం తెలిసి రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు అధినేత బుధవారం అతనికి మందుల కోసం రూ.15వేల ఆర్థిక సాయాన్ని ట్రస్టు సభ్యుడు ప్రజేంద్రరెడ్డి ద్వారా అందజేశారు.

బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ నరసింహులు

వెంకటగిరి రూరల్: వెంకటగిరి తహసీల్దార్‌గా సుంకర వెంకట నరసింహులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ రాంబాబు ఉద్యోగ విరమణ చేయడంతో సూళ్లూరుపేట తహసీల్దార్‌గా పనిచేస్తున్న నరసింహులు వెంకటగిరిలో బాధ్యతలు స్వీకరించారు. ముందుగా స్థానిక పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. రెవెన్యూ కార్యాలయ సిబ్బంది తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.


అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

ఓజిలి: అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మండలంలోని కురుగొండ, మానమాల గ్రామాల్లో బుధవారం సుపరిపాలనకు తొలిఏడాది కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం, మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌నాయుడు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ



విద్యాసామగ్రి ఇస్తున్న నేతలు

గూడూరురూరల్: గూడూరు మండలం నెల్లటూరు గిరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఏఐబీఈఏ యూనియన్ 75వ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు, పలకలు, బలపాలతోపాటు దుప్పట్లు పంపిణీ చేశారు. దాతలుగా క్లెయిమ్స్ ఏఏఓ శర్మ, ఎస్.శివకుమార్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఐసీఈయూ బ్రాంచ్ అధ్యక్షుడు మనోజ్‌కుమార్, కార్యదర్శి శివకుమార్, ట్రెజరర్ తరుణ్ సాయి, విజయభాస్కర్ పాల్గొన్నారు.

ఉపాధిలో సిబ్బంది కొరత

గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లకుండా స్థానికంగా పనులు కల్పించడానికి ఉద్దేశించిన ఉపాధి హామీ కార్యాలయంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఫలితంగా వున్న కొద్దిపాటి సిబ్బంది పంచాయతీల్లో కూలీలకు అవసరమైన పనులు చూపించలేకపోతున్నారు. కూలీలకు సకాలంలో వేతనాలు అందించేలా చర్యలు తీసుకోలేకపోతున్నారు. దీంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- 27 పంచాయతీలకు ముగ్గురు టీఏలు
- మూడు నెలలుగా ఏపీఓ పోస్టు ఖాళీ
- మొత్తం జాబ్‌కార్డులు 10,614
- యాక్టివ్ జాబ్ కార్డులు 8,699



దక్కిలి ఉపాధి కార్యాలయం



తాళం వేసి ఉన్న ఏపీఓ కార్యాలయం

దక్కిలి: దక్కిలి ఉపాధి హామీ కార్యాలయంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. తగినంత మంది సిబ్బంది లేకపోవడంతో పనిభారం పెరిగిందని సిబ్బంది వాపోతున్నారు. మండలంలో 27 గ్రామ పంచాయతీలకుగాను 10,614 జాబ్‌కార్డులు వున్నాయి. వాటిలో యాక్టివ్ జాబ్‌కార్డులు 8,699 ఉన్నాయి. ఐదుగురు టెక్నికల్ అసిస్టెంట్లు పని చేయాల్సి ఉండగా ముగ్గురు మాత్రమే వున్నారు. ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు ఉండాల్సి ఉండగా ఒక్కరే పనిచేస్తున్నారు. మండలంలోని 27 పంచాయతీల్లో ప్రతిరోజూ రెండు వేల మందికి పైగా కూలీలు పనులు చేస్తున్నారు. వారికి అవసరమైన పనులు కల్పించడం, సకాలంలో మస్టర్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం, కూలీలు చేసిన పని కొలతలు తీయడం, వారికి రూ.270లకు తగ్గకుండా వేతనం అందేలా చర్యలు తీసుకోవడం వంటి పనులు టెక్నికల్ అసిస్టెంట్లు చేయాలి. లక్ష్యానికి మించి పని దినాలు కల్పించాలని ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తుంటారు. దీంతో పనిభారం పెరిగి సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ప్రతిరోజూ పనులకు హాజరైన కూలీలు, వారు పనిచేసిన పనుల వివరాలను, మస్టర్లను ఎప్పటికప్పుడు కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. సిబ్బంది కొరత కారణంగా కూలీల పనుల వివరాలు, మస్టర్లను అప్‌లోడ్ చేయడంలో ఆలస్యం అవుతోంది. అంతేగాక కొత్త జాబ్‌కార్డుల మంజూరు, కూలీల వేతనాల వివరాలు, టెక్నికల్ సమస్యలు జాబ్‌కార్డుదారులకు వివరించాల్సి ఉంది. ఒక్కరే పని చేయడం వల్ల ఇబ్బందులు తప్పడం లేదు. అత్యవసర సమయంలో సెలవు తీసుకోవాలన్నా వీలుకావడం లేదని కంప్యూటర్ ఆపరేటర్ వాపోతున్నారు. దీనికితోడు మూడు నెలల నుంచి ఏపీఓ పోస్టు ఖాళీగా ఉంది. పనుల పర్యవేక్షణ, కూలీల వేతనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవడం వంటి పనులను కూడా ఈసీ ఒక్కరే చూసుకోవాల్సి వస్తోంది.



ఒక్కరే పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్

సిబ్బంది కొరతను పీడీ దృష్టికి తీసుకెళ్తాం



ఉపాధి హామీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ పోస్టుతో పాటు ఇతర సమస్యలు వున్నాయి. సకాలంలో అన్ని పనులు పూర్తి చేయడం కష్టంగా ఉంది. సిబ్బంది కొరత విషయాన్ని జిల్లా పీడీ దృష్టికి తీసుకెళ్తాం.

\- దామోదరరాజు, ఈసీ

యూరియా కొరత లేకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీపీ రాజశేఖర్

దక్కిలి: ఖరీఫ్ కింద వరి సాగు చేస్తున్న రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని ఎంపీపీ గోను రాజశేఖర్ అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ సమావేశాన్ని ఎంపీడీఓ గుణశేఖర్‌రెడ్డి నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని రైతు సేవా కేంద్రాల పరిధిలోని రైతాంగానికి యూరియా సకాలంలో అందేలా వ్యవసాయశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పాఠశాలల విలీనంపై ఆగ్రహం

మండలంలోని వెలికల్లు గ్రామంలోని మూడు ప్రాథమిక పాఠశాలలను మార్లగుంటకు విలీనం చేశారంటూ మండల ఉపాధ్యక్షుడు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ మచ్చల వెంకటరమణ ఎంఈఓ వెంకటేశ్వర్లుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందించిన ఎంఈఓ కమిషనర్ ఆదేశాల మేరకు విలీనం జరిగిందని సమాధానం ఇచ్చారు. తహసీల్దార్ ఎం శ్రీనివాసులు, ఎంపీడీఓ గుణశేఖర్‌రెడ్డి, వైద్యాధికారిణి బిందు ప్రియాంక్, ఇరిగేషన్ డీఈఈ కోటేశ్వరరావు, ఏఓ శిరీష, ట్రాన్స్‌కో ఏఈఈ అశోక్, ఆర్‌అండ్‌బీ ఏఈఈ బాబు, పీఆర్‌ఏ ఈఈ చంద్రశేఖర్, పశువైద్యాధికారి కిషోర్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

గిరిజన భూముల పరిశీలన



భూములను పరిశీలిస్తున్న నిరంజన్

దొరవారిసత్రం: తనియాలి పరిధి ఎస్టీ కాలనీలోని గిరిజనులకు చెందిన సీజేఎఫ్‌ఎస్ భూములను బుధవారం ఐటీడీఏ ఏపీఓ నిరంజన్ పరిశీలించా రు. గిరిజనుల అనుభవంలో ఉన్న 25 కుటుంబాలకు చెందిన 25 ఎకరాల సీజేఎఫ్‌ఎస్ భూములకు డీకేటీ పట్టాలు ఇవ్వాలంటూ గతంలో కూటమి ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సు వద్ద గిరిజనులు ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన ఐటీడీఏ అధికారులు తనియాలి ఎస్టీ కాలనీలోని గిరిజన అనుభవంలో ఉన్న భూ ములను స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. పరిశీలించిన నివేదికను జిల్లా అధికారులకు అందజేసి త్వరలోనే గిరిజనులకు డీకేటీ పట్టాలు ఇస్తామని ఏపీఓ తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ శైలకుమారి, వీఆర్వో వినయ్, సర్వేయర్ నవీన్ ఉన్నారు.

పరామర్శ



సునీల్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ, నేతలు

చిల్లకూరు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కొండూరు సునీల్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులను బుధవారం ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేరిగ మురళీధర్‌తో పాటు పలువురు నా యకులు పరామర్శించారు. గూడూ రు రూరల్ మండలం తిప్పవరప్పాడు గ్రామానికి చెందిన కొండూరు సునీల్‌రెడ్డి తల్లి మస్తానమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలిసి ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, పలువురు పార్టీ నేతలు తిప్పవరప్పాడుకు చేరుకుని మృతదేహానికి నివాళుర్పించారు.

పని గంటలు ఉంటేనే పూర్తి వేతనం



సమీక్షలో మాట్లాడుతున్న ఏపీఓ

చిల్లకూరు: ఉపాధి పథకం కింద పని చేసే కూలీలకు కచ్చితమైన పని గంటలు ఉంటేనే వారికి పూర్తి వేతనం అందుతుందని ఏపీఓ గిరి సూచించారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో బుధవారం ఆయన క్షేత్ర సహాయకులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూలీలు కచ్చితంగా నాలుగు గంటలపాటు పనిచేయాలన్నారు. ఇందుకుగాను పనులు చేసే ప్రాంతంలో కూలీల ఫొటోలను రెండు పర్యాయాలు ఆన్‌లైన్‌లో అక్కడికక్కడే అప్‌లోడ్ చేయాలని తెలిపారు. చేయని పక్షంలో కూలీలకు నగదు చెల్లింపులు జరగవని, అందుకు బాధ్యులుగా క్షేత్ర సహాయకులుగా చేస్తూ వారి నుంచి రికవరీ చేయాల్సి ఉంటుందని చెప్పారు. టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఈసీలు పాల్గొన్నారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు



దాబాలో తనిఖీలు చేస్తున్న నర్మద

నాయుడుపేటటౌన్: పట్టణంలో తిరుపతి జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నర్మద బుధవారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని దాబాలు, హోటళ్లలో ఆమె తనిఖీలు చేశారు. పరిశుభ్రత పాటించని హోటళ్లకు అపరాధ రుసుం విధించారు. పరిశుభ్రత పాటించని ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల యజమానులను హెచ్చరించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు చేస్తున్నారని తెలిసి పలు హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను మూసి వేశారు.

బెల్ట్ షాపులపై చర్యలు



అధికారులతో సమీక్షిస్తున్న నాగమల్లేశ్వరరెడ్డి

గూడూరురూరల్: నకిలీ మద్యం, బెల్టు షాపుల నిర్వహణపై చర్యలు తప్పవని డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి నాగమల్లేశ్వరరెడ్డి అన్నారు. గూడూరులోని పాలిటెక్నిక్ కళాశాల సెమినార్ హాలులో బుధవారం డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లైసెన్స్ పొందిన రీటైల్ మద్యం దుకాణాల నుంచి మాత్రమే మద్యం కొనుగోలు చేయాలన్నారు. లైసెన్స్ లేని వ్యక్తుల (అనధికార వ్యక్తుల) నుంచి మద్యం కొనుగోలు చేయడం ప్రమాదకరమని, అవి నకిలీ మద్యం కావచ్చని తెలిపారు. అలాంటి అనుమానిత వ్యక్తుల వివరాలను వెంటనే ఎక్సైజ్ శాఖకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. టోల్‌ఫ్రీ నంబర్ 14405, తిరుపతి జిల్లా అధికారికి 9440902540 సమాచారం అందించాలన్నారు. గూడూరు ఏఈఎస్ ఉషశ్రీ, సీఐ కరీమాబేగం, సీఐలు, ఎస్‌ఐలు, పాల్గొన్నారు.

కారు-బైక్ ఢీ

సైదాపురం: మండల కేంద్రం సమీపంలో బుధవారం రాత్రి కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వ్యక్తి గూడూరు రూరల్ మండలంలోని చెమిర్తి గ్రామానికి చెందిన శ్రీనివాసులుగా గుర్తించారు. గాయపడ్డ అతన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

బడులు మారిస్తే చదువులు చతికిల పడతాయి



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు, పేరెంట్స్

తడ: సజావుగా సాగుతున్న పాఠశాల విద్యను ప్రజాభీష్టానికి విరుద్ధంగా బడులను విలీనం చేస్తే పిల్లల చదువులు చతికిల పడతాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగరాజు అన్నారు. తడ హరిజనవాడ, అక్కంపేట తూర్పు పాఠశాలలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు గత కొంత కాలంగా చేస్తున్న ఆందోళనల నేపథ్యంలో సీఐటీయూ, సీపీఎంల ఆధ్వర్యంలో బుధవారం ఎంపీడీఓ, ఎంఈఓ కార్యాలయాల వద్ద ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. సూళ్లూరుపేట సీపీఎం, సీఐటీయూ నాయకులు సీహెచ్ చంంద్రశేఖర్‌రెడ్డి, సుంకర అల్లెయ్య, లక్ష్మయ్య, వెంకటరమణ, కరీం పాల్గొన్నారు.

ఘనంగా పీర్ల పండుగ



పీర్ల వద్ద ప్రార్థనలు చేస్తున్న హిందూ, ముస్లింలు

నాయుడుపేటటౌన్: మొహర్రం పండుగను పురస్కరించుకుని బుధవారం పీర్ల పండుగను ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని గరిడీ వీధిలోని హజరత్ మౌలాలి తాలీమ్ ఖానాలో ప్రతిష్టించిన పంజా (పీర్లు)ల వద్ద ముస్లింలు, హిందువులు ఫాతేహాలు జరుపుకుని ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. మధ్యాహ్నం మౌలాలి తాలీమ్ ఖానా వద్ద పట్టణానికి 786 రఫీ సేవా సంఘ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

చిట్టమూరులో మొహర్రం

చిట్టమూరు: ఆరూరు గ్రామంలో మొహర్రం వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీర్ల చావడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పీర్లను పుష్పాలతో అలంకరించారు. రాత్రి అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు చెల్లించుకున్నారు.


పార్క్‌కు స్థల పరిశీలన

బాలాయపల్లి(సైదాపురం): మన్నూరులోని ప్రభుత్వ భూమిని తహసీల్దార్ విజయలక్ష్మి బుధవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో ఎంఎస్‌ఎంఈ పార్క్ మంజూరైందని ఈ మేరకు స్థల పరిశీలన చేశామన్నారు. స్థల వివరాలను అధికారులకు నివేదించినట్లు ఆమె తెలిపారు.



స్థల పరిశీలన చేస్తున్న తహసీల్దార్

గుండెపోటుతో ట్రాన్స్‌కో ఏఈ మృతి



పోలయ్య(ఫైల్)

చిట్టమూరు: మండలంలోని కొత్తగుంట సబ్‌స్టేషన్‌లో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న పోలయ్య(50) గుండెపోటుతో బుధవారం రాత్రి మృతి చెందినట్లు సిబ్బంది తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

మళ్లీ యూరియా కొరత

వాకాడు: మండలంలో ఖరీఫ్ సాగు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటికి నాలుగు సార్లు యూరియా కొరతతో రైతులు సతమతమయ్యారు. తాజాగా బుధవారం మండలంలో ఎక్కడ యూరియా లేదంటూ అటు రైతు సేవా కేంద్రాలు, ఇటు ప్రయివేట్ ఎరువు దుకాణాలు చేతులు ఎత్తేశాయి. దీంతో పంట సాగు చేస్తున్న రైతులు యూరియా కోసం పక్క మండలాలకు పరుగులు తీస్తున్నారు. మండలంలో 1,200 హెక్టార్లలో రైతులు వరి సాగు చేపట్టారు. పలుమార్లు యూరియా కొరత ఏర్పడి రైతులు గగ్గోలు పెట్టడంతో 325 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందజేసినట్లు తెలిసింది. అందులో కూడా యూరియా అవసరమైన రైతులు ముందుగా డబ్బులు కట్టి డీడీ తీస్తేనే రెండు రోజుల తరువాత యూరియాను తెప్పించి అందజేయడం గతంలో ఎన్నడూలేదు. పెద్ద రైతులు మాత్రం ముందుగా డబ్బులు కట్టి యూరియాను తెచ్చుకుంటున్నారు. చిన్న, సన్న కారు రైతులు ముందుగా డబ్బులు చెల్లించలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇంకా మండలంలో 190 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉన్నట్లు తెలిసింది.

రైతు బిడ్డకు సేవా పురస్కారాలు



పురస్కారం అందుకుంటున్న రఘురామిరెడ్డి

చిల్లకూరు: రైతు బిడ్డగా పుట్టి సేవాభావం కలిగి గత 25 ఏళ్ల క్రితం రోటరీ సభ్యునిగా చేరి ఆరు సేవా పురస్కారాలను రఘురామిరెడ్డి అందుకున్నాడని రోటరీ క్లబ్ ప్రతినిధులు కొనియాడారు. గూడూరు పట్టణంలోని రోటరీ భవన్‌లో బుధవారం రఘురామిరెడ్డిని సేవా పురస్కారంతో సత్కరించారు. పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ తిప్పగుంటపాళెంకు చెందిన పాజెర్ల రఘురామిరెడ్డి సేవాభావంతో 2001లో రోటరీ క్లబ్‌లో సభ్యునిగా చేరి పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేశారు. గుర్తించిన రోటరీ క్లబ్ ఇప్పటికే ఆరు పర్యాయాలు సేవా పురస్కారాలు అందించిందన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు సురేంద్రరెడ్డి, మునిగిరీష్, దశరథరామిరెడ్డి పాల్గొన్నారు.

చెరువును పరిశీలించిన ఈఈ



చెరువును పరిశీలిస్తున్న ఈఈ

కలువాయి(సైదాపురం): మండలంలోని కలువాయి చెరువును ఈఈ శ్రీనివాస్‌కుమార్ బుధవారం పరిశీలించారు. చెరువు నుంచి దక్షిణ కాలువకు నీరు వెళ్లే గేట్ వాల్వు పరిశీలించారు. గేట్ వాల్వుల వద్ద వచ్చే టెక్నికల్ సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులకు ఆదేశాలను జారీచేశారు. డీఈ మస్తానయ్య, ఏఈ నారాయణరాజు, వెంకటేశ్వర్‌రెడ్డి, కాలేషా, దక్షిణ కాలువ నీటి సంఘం ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

10న గురుపౌర్ణమి వేడుకలు

వెంకటగిరి రూరల్: గురుపౌర్ణమి పురస్కరించుకుని పట్టణంలోని కుమ్మరిగుంట షిరిడీ సాయిబాబా ఆశ్రమంలో ఈనెల 10న ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఆలయంలో సుప్రభాతం, కాగడ హారతితోపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈనెల 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు గురుచరిత్ర పారాయణ దీక్షలు నిర్వహించనున్నట్లు ప్రకటనలో చెప్పారు.

ఆత్మీయ కలయిక



నేదురుమల్లికి మొక్క ఇస్తున్న గౌరిరెడ్డి

సైదాపురం: వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డిని బుధవారం రాష్ట్ర మహిళ జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నేదురుమల్లి ఆమెతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ శ్రీకారం చుట్టిన 'రీకాల్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' కార్యక్రమంలో మహిళా విభాగం చురుకైన పాత్ర పోషించాలని కోరారు.

పేర్లు నమోదు చేసుకోండి

నాయుడుపేటటౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలను పొందేందుకు లబ్ధిదారులు వారి పేర్లు, ఆధార్ నంబర్‌లను ఐసీడీఎస్‌కు సంబంధించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల యాప్‌లలో నమోదు చేసుకోవాలని సీడీపీఓ ఉమామహేశ్వరి బుధవారం సూచించారు. ప్రాజెక్టు పరిధిలోని నాయుడుపేట, ఓజిలి, పెళ్లకూరు మండలాలకు సంబంధించి 216 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని లబ్ధిదారులందరూ ట్రాకర్ యాప్‌లలో ముఖ ఆధారిత విధానంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. లేకుంటే ఎటువంటి సేవలు అందించలేమని చెప్పారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా రవీంద్రబాబు

సైదాపురం: ఎంపీడీఓగా రవీంద్రబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఓజిలి ఎంపీడీఓగా పనిచేస్తున్నారు. సైదాపురంలో ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ సెలవుపై వెళ్లడంతో ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

విజిలెన్స్ విచారణ

సైదాపురం: మండలంలోని 2018–19 ఆర్థిక సంవత్సరంలో ఉన్నతి పథకంలో జరిగిన అవకతవకలపై బుధవారం జిల్లా విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా పలు రికార్డులను సిబ్బందితో కలిసి పరిశీలించారు. సమగ్ర నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులు అందజేస్తామని విజిలెన్స్ అధికారులు తెలిపారు.

కండలేరులో చేపల వేట నిషేధం

రాపూరు: కండలేరు జలాశయంలో చేపల వేట నిషేధిస్తున్నట్లు మత్స్యశాఖ సహాయ పరిశీలకులు సంజయ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 1నుంచి ఆగస్టు 31 వరకు ప్రభుత్వం నిషేధించినట్లు పేర్కొన్నారు. ఈసమయంలో చేపలు సంతానోత్పత్తి చేస్తాయని అందువల్ల చేపల వేట నిషేధించినట్లు తెలిపారు. నిషేధ సమయంలో చేపల వేట సాగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.